ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 7
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 15 ఆగస్టు 2025

మరక మంచిదేనా..?

- ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
- ఎంపిక తీరుపై ఆయా శాఖల్లోనే విమర్శలు

(వివరాలు 8లో...)

టీడీపీ సంబరాలు

కడపలో గెలుపుపై అనంతలో ఆనందోత్సాహాలు

(వివరాలు 8వ పేజీలో...)

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ




ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాలను పండుగలా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్డీఓ కేశవనాయుడుతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. వేడుకలలో రాష్ట్రీయ సెల్యూట్ సమర్పణ, పరేడ్ సందర్శన, మార్చ్ ఫాస్ట్, శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అయ్యో.. దేవుడా..!

- లారీ ఢీకొని గుంతకల్లులో బాలిక దుర్మరణం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు

(8లో...)

జగన్‌కు చెంపపెట్టు

- ప్రభుత్వ విప్ కాలవ



కణేకల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి విజయం జగన్‌కు చెంపపెట్టు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల ఫలితాలపై గురువారం ఆయన కణేకల్లులో విలేకరులతో మాట్లాడారు. మూడున్నర దశాబ్దాల తర్వాత పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా అక్కడ అప్రజాస్వామిక పాలన కొనసాగుతోందని తెలిపారు. వైసీపీ అభ్యర్థికి డిపాజిట్లు కూడా రాలేదంటే జగన్‌పై పులివెందుల ప్రజలకు ఎంత కోపం ఉందో ఈ ఎన్నికల ద్వారా బహిర్గతమైందన్నారు. అడుగడుగునా అరాచకాలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులను చేస్తున్న జగన్ అరాచకానికి అక్కడి ప్రజలు సరైన తీర్పు ఇచ్చారన్నారు. టీడీపీ విజయం పట్ల సాధారణ ప్రజలతో పాటు రాష్ట్రం మొత్తం సంబరాలు చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మెన్ హనుమంతరెడ్డితో పాటు టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, కోకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, చంద్రశేఖర్‌గుప్తా, మాబుసాబ్, చాంద్‌బాషాతోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


డీఎస్పీ శ్రీనివాసరావుకు విశిష్ట సేవాపతకం



డీఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్పీ శ్రీనివాసరావు విశిష్ట సేవాపథకానికి ఎంపికయ్యారు. అనంతపురం డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన, శాంతి భద్రతల పరిరక్షణకు అందించిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియల్ సర్వీస్ అవార్డుకు ఎంపిక చేసింది. శ్రీనివాసరావు 1989లో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 2004లో సీఐగా, 2014లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. నూజివీడు, కందుకూరు, చీరాల, విజయవాడ ఈస్ట్ తదితర ప్రాంతాల్లో పనిచేశారు. గతంలో ఏపీ సేవా పతకం, ఏపీ ఉత్తమ సేవా పతకం, ఏపీ మహోన్నత సేవా పతకం, అతి ఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. తాజాగా విశిష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. దీంతో ఎస్పీ జగదీష్, పలువురు పోలీసు అధికారులు ఆయనను అభినందించారు.

రైట్.. రైట్..



- 'స్త్రీ శక్తి'కి శ్రీకారం నేడే
- ఉచిత బస్సు ప్రయాణం అమలుకు అనంత ఆర్టీసీ సన్నద్ధం
- మహిళల్లో హర్షాతిరేకాలు

(వివరాలు 8వ పేజీలో...)


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

టీడీపీ సంబరాలు

కడపలో గెలుపుపై అనంతలో ఆనందోత్సాహాలు

అనంతపురం క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై అనంతపురంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. గురువారం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలుగా టీడీపీ అభ్యర్థులు గెలవడంతో అనంతపురం నగరంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. జడ్పీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత టీడీపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... 40 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రాంతంలో ప్రజాస్వామ్యం కనిపించిందన్నారు. వైనాట్ పులివెందుల అన్నామనీ, ఇప్పుడు గెలిచి చూపించామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేస్తే.. ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలోనే కాకుండా కడప జిల్లా అంతటా టీడీపీ జెండా రెపరెపలాడుతోందన్నారు.

ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో...


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందనీ, ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాల నియంతృత్వ పోకడలు అమలు చేసిన ఫ్యాక్షన్ చరిత్ర వైఎస్ కుటుంబానిదన్నారు. జగన్ రెడ్డి నేతృత్వంలో ప్రజలను బానిసల్లా చూశారన్నారు. 40 ఏళ్లు అక్కడ ఇదే జరిగిందని, ఈ ఎన్నికల్లో అక్కడ ప్రజలు స్వేచ్ఛగా తమకు నచ్చిన వ్యక్తులకు ఓటు వేశారన్నారు.

నష్టం వివరాలు తెలుసుకోండి: మంత్రి


కార్మికులతో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ, కమిషనర్

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధర్మవరంలో చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించారు. నష్టపోయిన చేనేత కార్మికులను గుర్తించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేశ్‌బాబు, హ్యాండ్‌లూమ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ అధికారులు గురువారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, దుర్గానగర్, ఎల్-3 కాలనీలో పర్యటించి మగ్గం గుంతల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. నష్టం వివరాలపై అక్కడి నేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటామని అధికారులు భరోసా ఇచ్చారు. నష్టపోయిన వారందరికీ ఆర్థికసాయం, సబ్సిడీల రూపంలో తక్షణ సాయం అందించేలా చర్యలుతీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోండి

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్‌పీసీఐ లింక్‌లేని రైతులు ఈనెల 20లోపు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు గురువారం ఓప్రకటనలో కోరారు. జిల్లాలో ఈనెల 2న 2,65,040మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయన్నారు. ఇప్పటికి ఎన్‌పీసీఐ లేని రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నీటి పంపులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.3వేల కోట్లు కేటాయించి, విస్తరణ పనులు చేపట్టడాన్ని హర్షిస్తున్నామన్నారు. హంద్రీనీవా కాలువకు 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారన్నారు. 30ఏళ్లు కావస్తున్నా, నేటికీ పిల్లకాలువ నిర్మాణాలు జరగక పోవడంవల్ల రైతులకు సాగు నీరు అందడం లేదన్నారు. రాయలసీమలోని గాలేరు, నగరి, వెలిగోడు ప్రాజెక్టులు కూడా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, వేల కోట్ల రూపాయలతో పోలవరం, బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వడం కాంట్రాక్టుల కోసమేనని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పూర్తి చేసిన తర్వాతనే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిధులు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, సుల్తాన్, సంగప్ప పాల్గొన్నారు.

మరక మంచిదేనా..?

- అవినీతి మరకలున్న వారికీ ఉత్తమ అధికారులుగా అవార్డులు
- ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
- ఎంపిక తీరుపై ఆయా శాఖల్లోనే విమర్శలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా అందించే ఉత్తమ సేవకుల పురస్కారాల్లో అవినీతి మరకలున్న వారి పేర్లు కూడా ఉంటుండటం విమర్శలకు తావిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పని తీరు కనబరిచిన కొందరు అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేశారు. అయితే ఇవి అక్రమార్కులు, అవినీతిపరులకు ఇస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



పుష్కలమైన అవినీతి

ఏదో ఒక పనిచేసి పెడితే పైసలు పుచ్చుకునే అధికారులు కాదు వారు. ఈ పని చేస్తే ఇంత ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసి మరీ పుచ్చుకుంటారు. అలాంటి అధికారులకు గతంలో ఉత్తమ అధికారులంటూ అవార్డులు అందజేశారు. ఇక ఏసీబీ అధికారుల తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయిన అధికారులు, సస్పెండైన అధికారులకు సైతం అవార్డులు దక్కాయంటే నోరెళ్లబెట్టక తప్పదు. ఉదాహరణకు...

- అనంతపురం నగరపాలక పరిధిలో తాగునీటి సరఫరా విభాగంతో పాటు సివిల్ వర్క్స్ పర్యవేక్షించిన ఓ డీఈ అవినీతికి అంతే లేదు. కమీషన్లతో పాటు బినామీ కాంట్రాక్టర్లతో దొంగ బిల్లులు చేయించిన ఘనత ఈయనది. గత ఏడాది ఈయనగారికి ఉత్తమ అధికారి అంటూ అవార్డు ఇచ్చారు మరి.
- కళ్యాణదుర్గం పంచాయతీరాజ్ శాఖలో గత ఏడాది డీఈగా పనిచేసిన ఓ ఇంజనీర్ అవినీతిలో బాగా ఆరితేరిపోయారు. ఆయన విధులకు ఎప్పుడొస్తారో తెలియదు. సెలవులోనే ఎక్కువగా ఉండేవారు. బళ్లారిలో బిల్లులు, కమీషన్ల వ్యవహారాలు నడిపే ఈయన అక్కడే రూ.కోట్లు వెచ్చించి కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నారట. ఈయనకూ గత ఏడాది అవార్డు ఇచ్చేశారు.
- మూడేళ్ల కిందట ఓ అధికారి పేరు చూసి ఆ శాఖ వర్గాలు నివ్వెరపోయాయి. అనంతపురం పరిధిలో ఆర్ఐగా సస్పెండ్ అయి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన ఓ అధికారికి అవార్డు దక్కింది.
- పోలీస్ శాఖలోనూ గత రెండేళ్లలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, మరో ఆరుగురు ఎస్ఐలకు అవార్డులు దక్కాయి. పంచాయతీలు, సెటిల్మెంట్‌లలో వీరు బాగానే వెనుకేసుకున్నారనే ఆరోపణలున్నాయి.


అనంతపురం కలెక్టర్ కార్యాలయం

- ఇక రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలలో 70 శాతం మంది అవినీతి మరకలున్న అధికారులే. వీరిలో కొందరు ఇప్పటివరకు ఐదారుసార్లు అవార్డు పొందడం గమనార్హం.
- గతంలో ఆర్డీఓలు, డీఎస్పీలు...ఈ పోస్టుంటే చాలు వారు అవినీతి మరకలున్నా అవార్డులు అందజేశారు. కేవలం ఆ హోదాను చూసి ఇచ్చారనే విమర్శలొచ్చాయి.

ఈ సారైనా...

ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ముస్సోరీలో శిక్షణ నిమిత్తం సెలవులో ఉన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్నారు. ఈయన నిబంధనల విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఈ సారి విడుదలయ్యే అవార్డు జాబితాలో అవినీతిని తగ్గిస్తారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 400 మందికి పైగా ఉండే అధికారుల జాబితాలో అవినీతి మరకలున్న అధికారులెందరో చూడాలి.

జంబో జాబితా...

అవార్డుల జాబితా చూస్తే జిల్లాలో నిజాయతీ, ప్రజా సేవలో తపించే అధికారులు ఇంత మంది ఉన్నారా ప్రజలు సైతం ఆశ్చర్యపోయేలా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇంత మంది నిజాయతీ అధికారులు ఉంటే ప్రజల సమస్యలు త్వరగా ఎందుకు పరిష్కారం కావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఉత్తమ అధికారుల జాబితా చాంతాడంత ఉంటోంది. గతంలో 400మందికి పైగా ఉత్తమ అధికారులను ఎంపిక చేశారు. ఈ సారి 400 పైచిలుకే జాబితా తయారైంది. ఆయా శాఖలో అవినీతికి పాల్పడుతున్నారని తెలిసినా వారి పేర్లు అవార్డు జాబితాలో చేరుతోంది. కొందరు అధికారులు తమ శాఖల్లో ఉన్నతాధికారులకు అనుకూలంగా వ్యవహరించి జాబితాలో తమ పేరుండేలా చేసుకుంటున్నారు. అలాగే తమపై అవినీతిమరక పోగొట్టుకోవడానికి ఇలా చేయించారనే ఆరోపణలున్నాయి.

పరిశీలిస్తా



గతంలో అవినీతి అధికారులకు అవార్డులు వచ్చిన విషయం నాకు తెలియదు. ప్రతి శాఖ నుంచి అధికారుల జాబితా పంపుతారు. ఉత్తమ అధికారుల జాబితా పరిశీలించి, అర్హులకే అందజేస్తా.

- శివనారాయణశర్మ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్

వర్ష సూచన

బుక్కరాయసముద్రం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి, మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 28.5-30.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠంగా 22.4-23.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 12-14 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. గాలిలో తేమ ఉదయం పూట 74-79, మధ్యాహ్నం 50-60 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.
అనంతపురం జిల్లాలో 15న 8మి.మీ, 16న 2.5 మి.మీ, 17న 4.2 మి.మీ, 18న 7 మి.మీ, 19న 7.5మి.మీ, కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 15న 8మి.మీ, 16న 2.5 మి.మీ, 17న 2.9 మి.మీ, 18న 2.5 మి.మీ, 19న 3 మి.మీ, కురిసే అవకాశం ఉందన్నారు.

వాతావరణ సలహాలు

ఉమ్మడి జిల్లాలో వర్షాధారం కింద ఉన్న ఎర్ర నేలలో వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, అనుములు, పెసర పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అధిక వర్షం కురిసినపుడు నీరు పోయేలా పొలాల్లో కాలువ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆర్ఎస్‌కేలో ఫిర్యాదు చేయండి

కొత్తచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు జమ కానీ రైతులు ఈనెల 20లోగా వారి వారి గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో అర్జీలు అందించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 625 మంది రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోగా 327 మంది రికార్డులు అనుమతించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే రైతుసేవా కేంద్రాలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అందజేసి ఫిర్యాదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అర్బన్‌లో జగడం

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర ఆరోపణలు
- అభివృద్ధి, అవినీతి అంశాలపై ఘాటు విమర్శలు

అనంతపురం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర విమర్శలకు దిగారు. అభివృద్ధి, అవినీతి అంశాలపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. సాయినగర్‌లోని ఓ ఆస్పత్రి వివాదంతో మొదలై.. పాత విషయాలను తవ్వుకునేదాకా వెళ్లింది. తనపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు చేయడం వెనుక మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఉన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరోపించారు. కాగా, రామకృష్ణ మంచి భావాలు ఉన్న వ్యక్తి అని, ఆయనతో తాను మాట్లాడితే తప్పేమిటని ప్రభాకర్ చౌదరి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరు నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్నారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే, రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు.

నాకు రాజకీయం తెలియదు...



"రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు అభివృద్ధి తప్ప రాజకీయాలు చేయడం తెలియదు. సీఎం చంద్రబాబు ఆశీర్వాదం, మా యువనేత లోకేశ్ సహకారంతో ఎమ్మెల్యే అయ్యాను. నేను వచ్చినప్పటి నుంచి కుట్రలు చేస్తున్నారు. మళ్లీ నాకే ఎక్కడ టిక్కెట్ ఇస్తారోనన్న భయంతో పార్టీ లైన్‌లో ఉన్న మరో నాయకుడు బురద చల్లుతున్నారు. ఎంతటి సీనియర్లు అయినా క్రమశిక్షణ తప్పితే చర్యలు ఖాయం. నేను తప్పుచేయను. చేస్తే తలవంచుతాను. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం. నగరంలో ఏడాది కాలంలో రూ.122 కోట్లతో అభివృద్ధి చేశాను. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం డీపీఆర్ పంపాము. 30 ఏళ్ల డంపింగ్ యార్డ్ సమస్యను క్లియర్ చేయిస్తున్నాము. మూడు వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాము. సీపీఐ రామకృష్ణ నాకు బాగా తెలుసు. ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివినట్లున్నారు. ఎమ్మెల్యే అయ్యాక బంధువుల పేరిట, నా పేరిట సెంటు భూమి కొనలేదు. గతంలో సుగుణ చికెన్ దుకాణాల్లో వసూళ్లు అంటూ యల్లనూరు, పుట్లూరు వ్యక్తుల పేరుతో వాయిస్‌లు బయటకొచ్చాయి. ఆ ప్రాంతంలో ఎవరికి బాగా పరిచయాలు ఉన్నాయో అందరికీ తెలుసు. అస్త్ర ఆసుపత్రి ఘటనపై రాంనగర్‌లో ఉండే శ్రీనివాస్ చౌదరి కొందరు మీడియా వాళ్లను జడ్పీలోకి తీసుకెళ్లి బలవంతంగా మా వాళ్ల పేర్లు చెప్పించే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్‌ను విచారించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కోరాము. భూ కబ్జాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. నా వద్దే వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నా బావమరిది అశోక్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. గతంలో రహంతుల్లా, మహాలక్ష్మి శ్రీనివాస్ ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. ఇలాంటి రాజకీయాలు చేయడం నాకు తెలియదు. ఆ నాయకుడి అనుభవమంత వయస్సు కూడా నాకు లేదు. మంచి కోసం ఆయన సలహాలు ఇస్తే తీసుకుంటాను. 14 నెలలుగా నాపై కుట్రలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారు. ఇలాంటి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారు.." - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

దగ్గుపాటీ.. తేల్చుకుందాం రా..



"దగ్గుపాటీ.. నోరు అదుపులో పెట్టుకో. దమ్ము ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. పోటీ చేద్దాం. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూద్దాం. సమాధులను ఆక్రమించిన వాళ్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లు కూడా నన్ను పార్టీ నుంచీ సస్పెండ్ చేయాలని అడిగారని తెలిసింది. నువ్వు అర్ధరాత్రి టిక్కెట్ తెచ్చుకున్నా నేను కలిసి తిరిగాను. చంద్రబాబు సీఎం కావాలని కష్టపడ్డాను. నీ కోసం కాదు. ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి అవాకులు, చవాకులు పేలుతున్నావు. కష్టపడినోళ్లపై బురద చల్లుతావా? మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నేను అక్రమంగా ఆస్తులు సంపాయించానని అంటున్నావు. రా చర్చ పెట్టుకుందాం. నాకు ఎక్కడ అక్రమాస్తులు ఉన్నాయో లెటర్ ప్యాడ్‌పై రాసివ్వు. పార్టీ కోసం శ్రమించిన వాళ్లనే స్టేషన్లలో పోలీసుల చేత చితకబాదించింది నిజం కాదా? నీ దుర్నీతిపై ఆధారాలున్నా పార్టీ కోసం మౌనంగా ఉన్నాను. నా ఇంటిని బుల్డోజర్‌తో కొట్టిస్తానంటావా..? నేను తాలిబొట్లు తెంచానంటావా..? రాప్తాడు మర్డర్ కేసులో ముద్దాయి ఎవరు? సీపీఐ రామకృష్ణ మంచి భావాలున్న వ్యక్తి. ఆయనతో నేను మాట్లాడితే తప్పేంటి..? రాత్రి మందు తాగి మాట్లాడే వారెవరో అందరికీ తెలుసు.." - మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

రైట్.. రైట్..



- 'స్త్రీ శక్తి'కి శ్రీకారం నేడే
- ఉచిత బస్సు ప్రయాణం అమలుకు అనంత ఆర్టీసీ సన్నద్ధం
- మహిళల్లో హర్షాతిరేకాలు



అనంతపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదురుచూసిన వేళ రానే వచ్చింది. ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తికి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. సాయంత్రం 5 గంటల నుంచి పథకాన్ని అమలు చేసేందుకు అనంత ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనుమతించనున్నారు. ఆ మేరకు మహిళలు నిర్దేశించిన బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణ వసతి పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉచిత ప్రయాణ పథకం ఎంతోమంది మహిళలకు ప్రయోజనకరంగా మారనుంది. బాలికలు మొదలుకుని వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు సైతం వయోపరిమితి లేకుండా స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణ వసతి కలగనుంది. రోజూ ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లొచ్చేవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు సైతం చార్జీల భారం తప్పనుంది. ఓటరు కార్డుగానీ, ఆధార్ కార్డుగానీ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో పురుషులు 60శాతం, మహిళలు 40 శాతం ఉంటోంది. శుక్రవారం నుంచి అమలయ్యే పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉండొచ్చని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

అనంత ఆర్టీసీ సన్నద్ధం

స్త్రీ శక్తి పథకం అమలుకు అనంతపురం రీజియన్ ఆర్టీసీ అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటి నుంచే పథకం అమలుకు సంబంధించిన చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు. స్త్రీ శక్తి పథకానికి వినియోగించే పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కండీషన్‌ను పరిశీలించడంతోపాటు లైట్లు, టైర్లు అవసరమైన వాటికి ఏర్పాటు చేయించారు. బస్సుల్లో మహిళలకు టిక్కెట్ జారీ చేసే విధానంపైనా డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ కల్పించారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాన్ని ప్రారంభించిన తరువాత అనంతపురం డిపోలో ఇక్కడి ప్రజాప్రతినిధులచే పథకాన్ని ప్రారంభింపజేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అన్నిరకాల చర్యలు చేపట్టాం...



స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను కండీషన్‌లో ఉంచడంతోపాటు సిబ్బందికి అవగాహన కల్పించాం. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వర్తించేలా సూచించాం. పథకం ప్రారంభమయ్యాక మహిళా ప్రయాణికుల రద్దీ పెరగడంతోపాటు బస్సుల్లో గందరగోళం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పథకం గురించి మహిళలకు అవగాహన కలిగేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

- నాగభూపాల్, ఆర్టీసీ అనంతపురం డీఎం

మహిళలకు ఆర్థిక చేయూత...



స్త్రీ శక్తి పథకం అమలుతో రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కలిగింది. తద్వారా చార్జీల భారం తగ్గి మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందనడానికి సూపర్ సిక్స్ అమలు చేస్తుండడమే నిదర్శనం.

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

అయ్యో.. దేవుడా..!

- లారీ ఢీకొని గుంతకల్లులో బాలిక దుర్మరణం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు


ప్రమాదంలో కుమార్తెను చూసి రోదిస్తున్న తల్లి,


షేక్ అఫ్రీన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఎనిమిదేళ్లకు పుట్టిన ఆ పాపను తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. విద్యా బుద్ధులతో పాటు, ఆధ్యాత్మిక చింతన, దైవభక్తిని నేర్పిస్తున్నారు. ఈక్రమంలో ఆ చిన్నారి వారం కిందట ఖురాన్ పుస్తక పఠనం పూర్తి చేసింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో నాయనమ్మ ఇంటికి వెళ్తానని తండ్రిని ఒప్పించి తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. మార్గమధ్యంలో లారీ మృత్యువు రూపంలో ఢీ కొనడంతో ఆ పాప దుర్మరణం చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని విద్యానగర్-1లో నివాసముంటున్న షేక్ ఖాదర్ వలి, హసీనా బేగం దంపతుల కుమార్తె షేక్ అఫ్రీన్(12) పీఅండ్‌టీ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. షేక్ ఖాదర్‌వలి రైల్వే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు రావడంతో మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద నివాసముంటున్న నాయనమ్మ ఇంటికి వెళ్తనని తండ్రిని షేక్ అఫ్రీన్ అడిగింది. ఆయన అంగీకరించడంతో స్కూలుకు సెలవు పెట్టి తల్లితో కలిసి గురువారం మధ్యాహ్నమే బయల్దేరింది. గుత్తి రోడ్డులోని బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద వీరు వెళ్తున్న స్కూటీని బళ్లారి నుంచి గుత్తికి వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. స్కూటీలో వెనుక కూర్చున్న షేక్ అఫ్రీన్ కింద పడటంతో ఆమె మీదుగా లారీ వెళ్లింది. దీంతో శరీరం నుజ్జునుజ్జు అయ్యి బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి హసీనా బేగం స్వల్పంగా గాయపడింది. కళ్లెదుటే ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. కుమార్తె మరణవార్తతో తండ్రి కుప్పకూలిపోయాడు. లారీ డ్రైవర్ పారిపోతుండగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జ్వరంతో విద్యార్థిని మృతి


చైత్ర లలన (ఫైల్)

యాడికి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతూ ఏడో తరగతి విద్యార్థిని చైత్ర లలన (12) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికి గ్రామానికి చెందిన వద్ది జయరాం, లక్ష్మీప్రియ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె చైత్రలలన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి పరీక్ష రాసి వచ్చింది. జ్వరం వస్తుండటంతో బుధవారం ఇంటివద్దనే ఉన్నట్లు తెలిపారు. ఈక్రమంలో వాంతులు, విరోచనాలతో బాలిక పరిస్థితి సీరియస్ కావడంతో బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్ల మని చెప్పారు. అక్కడకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు తెలిపారు. బహుశా కార్డియాక్ అరెస్ట్ జరిగి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

ప్లాస్టిక్ నిషేధంపై వినూత్న శకటం


శకటం తయారీలో సూచనలు చేస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 ప్రకటించిన తరువాత ఏ రాష్ట్రంలోనూ స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర పరేడ్‌లో లేని విధంగా వినూత్నరీతిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే శకటాన్ని రూపొందిస్తున్నారు. ఏఎంసీ కమిషనర్ బాలస్వామి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం శకటం రూపుదిద్దుకుంది. ఈ శకటంలో రెండు నిమిషాలు నిడివి గల వీడియోను ప్రదర్శించనున్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యాన్ని సహించం

● మున్సిపల్ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య ప నుల నిర్వహణ, పర్యవేక్షణ లోపిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేదిలేదని అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. గురువారం ఉదయం స్థానిక శ్రీనగర్‌కాలనీ, రహమత్‌నగర్, ప్రభాకర్‌స్ట్రీట్, ఆజాద్‌నగర్, కళ్యాణదుర్గం రోడ్డులో కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. అన్ని డివిజన్లలో పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికబద్ధంగా పనిచేయాలని సూచించారు. అనంతరం బళ్ళారిరోడ్డు సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్ అక్కడ పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు.

లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం


చైర్‌పర్సన్ స్వప్నను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ లింగాయత్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన స్వప్నను సచివాలయ ఉద్యోగులు సన్మానించారు. గురువారం స్థానిక నివాసంలో ఆమెను కలిసి సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్ ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. శివశంకరయ్య, రవికుమార్, నాగిరెడ్డి, పర్వతరెడ్డి పాల్గొన్నారు.

1950 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1950 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైలు వ్యాగిన్‌లో వచ్చిన ఎరువుల రేక్‌ను ఆయన పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ జిల్లాకు డీఏపీ 1200. 20-20-0-13 రకం ఎరువులు 750 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు.

మన మిత్రతో అన్నదాత సుఖీభవ వివరాలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మన మిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా అన్నదాత సుఖీభవ వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ సొమ్ము జమకాని రైతులు వాట్సాప్ గ్రూప్‌లో ఆధార్ నంబర్‌తో చెక్ చేసుకోవచ్చన్నారు. ఏ కారణంతో జమ కాలేదో తెలుసుకుని, ఎన్‌పీసీఐ ఇనాక్టివ్ ఉంటే సంబంధిత బ్యాంకు, పోస్టాఫీసుల్లో ఎన్‌పీసీఐ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. వివరాలు రాకపోతే సంబంధిత రైతు సేవాకేంద్రంలో ఈనెల 20వ తేదీలోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో 5,809 మంది ఎన్‌పీసీఐ ఇనాక్టివ్, 1,432 మంది రైతులు ఎన్‌పీసీఐ నాట్ మ్యాప్‌డ్ జాబితాలో ఉన్నారన్నారు. ఈ జాబితాలోని రైతులు సంబంధిత బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. ఎన్‌పీసీఐ నాట్ మ్యాప్‌డ్ ఉన్న రైతులు స్థానిక తపాల కార్యాలయంలోనైనా మ్యాపింగ్ చేసుకోవచ్చన్నారు.

జేఎన్‌టీయూకు నాలుగు ఐఎస్టీ అవార్డులు

అనంతపురంరూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు నాలుగు భారత సాంకేతిక విద్యా సమాఖ్య (ఐఎస్టీ) అవార్డులు దక్కాయి. ప్రాజెక్టులు, పేటెంట్లు, పరిశోధనలు తదితర అంశాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు, అధ్యాపకులకు ఐఎస్టీ అవార్డులను అందజేస్తోంది. ఇందులో భాగంగా 2024 రాష్ట్రస్థాయి అవార్డులకు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్లు నారాయణరెడ్డి, దిలీప్‌కుమార్, కల్యాణిరాధ, శారద ఎంపికయ్యారు. గురువారం మదనపల్లెలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఐఎస్టీ ఇండియా చైర్మన్ డాక్టర్ ప్రతాప్‌సిన్హా కాకాసాహెబ్ దేశాయ్, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అవార్డులను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

అనంతపురం విద్య, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాంటిస్సోరి పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. గుత్తిరోడ్డు, సంగమేష్‌నగర్‌లలో ఉన్న విద్యాలయాల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, యశోద, సత్యభామల వేషధారణలో ఉట్టికొడుతూ సందడి చేశారు. విద్యాసంస్థల అధినేత సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాళ్లు రమాదేవి, పద్మావతి టీచర్లు, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

ఎరా స్కూల్‌లో..

అనంతపురంరూరల్: మండలంలోని కొడిమి సమీపంలో ఉన్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పిల్లలు నందగోపాలుడు, యశోద, శ్రీకృష్ణ, రాధ వేషధారణలతో అలరించారు. ఉట్టికొడుతూ సందడి చేశారు. చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయంలో ఆనందంగా నిర్వహించే పండుగ శ్రీకృష్ణాష్టమి అన్నారు. పాఠశాల డైరెక్టర్ వినూత్న రెడ్డి, విజయరావు, పంకూరి విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో ఉన్న పిల్లలతో పాఠశాల యాజమాన్యం

టైమింగ్ లేని ట్రెజరీ..!

● ఇన్‌చార్జి అధికారి ఎప్పుడొస్తారో..?
● సమయపాలన లేని అధికారులు, ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి విజిట్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఆ కార్యాలయం వద్దకే వెళ్లాలి. నెల జీతాల నుంచి పెద్ద బిల్లుల వరకు అక్కడి వారే పరిష్కారం చూపాలి. కలెక్టరేట్ కిందే ఉన్నా వారిని పర్యవేక్షించే వారే కరువయ్యారు. అదే ఖజానా(ట్రెజరీ)శాఖ కార్యాలయం. ఆర్థిక పరమైన లెక్కల వ్యవహారాలన్నీ ఇక్కడే తేల్చుకోవాలి. మాన్యువల్ విధానంలో ఉన్న సమయంలో బిల్లుల కోసం అక్కడే ఉండేవారు. సీఎఫ్ఎంఎస్ విధానం వచ్చాక కూడా వారికున్న డిమాండ్ తగ్గడం లేదు. బిల్లులు కావాలంటే వీరు ఆన్‌లైన్‌లో ఓకే చేస్తేనే చెల్లింపులయ్యేది. ఇలాంటి కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి.

ఇన్‌చార్జి రారు... సిబ్బంది సమయపాలన పాటించరు..

ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు విధులు సరిగా నిర్వర్తించడం లేదు. గురువారం ఆంధ్రజ్యోతి పరిశీలనలో కొన్ని సీట్లు ఖాళీగా కనిపించాయి. ఖజానా శాఖ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్(ఎఫ్ఏసీ)గా కడప జిల్లా ట్రెజరీ శాఖ డీడీని నియమించారు. కానీ ఈయన ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి. అక్కడున్న సిబ్బంది వారానికో


ఖాళీగా ఉన్న డీడీ సీటు

సారి వస్తుంటారని చెబుతారు. దీంతో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఉదయం 11గంటలైనా ఆఫీస్‌కు రాలేనంత బిజీగా ఉన్నారు. ఏటీఓ, ఎస్‌టీఓ అధికారులు సీనియర్ అకౌంటెంట్లు సీట్లు ఖాళీగా కనిపించాయి. వీరిలో కొందరు తీరిగ్గా అంటే 11గంటల తరువాత వచ్చి డీడీ చాంబర్‌లో ఉన్న రిజిస్టర్ సంతకాలు చేసి వారిసీట్లలో ఆసీనులయ్యారు. ఎక్కువ సమయం ఆ సీట్లలో కూర్చోరనే విమర్శలున్నాయి.

అన్నదాత సుఖీభవతో ఆనందం

● ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరిలో రైతులతో కలిసి గురువారం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సమయంలో చిరు జల్లులు కురిసినా ఉత్సాహంగా వేలాది మంది రైతులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో 52 వేల మంది రైతులకు రూ.36 కోట్లు అన్నదాత సుఖీభవ పథకం కింద జమైందని అన్నారు. జగన్ రెడ్డి రూ.15వేలు ఇస్తామని చెప్పి, కొందరికే ఇచ్చారని విమర్శించారు. సీఎం చంద్రబాబు పార్టీలకు అతీతంగా ఈ పథకాన్ని అమలు చేశారని అన్నారు. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలున్నా రూ.13వేల ప్రకారం ఇచ్చారని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించామని, అన్నదాత సుఖీభవ అందలేని 10 మంది లోపే వచ్చారని అన్నారు. అది కూడా ఉద్యోగాలు, వాహనాలు ఉన్నందుకే సాయం అందలేదని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కానుకను అందజేస్తున్నారని అన్నారు.

రోగులకు వైద్యసేవలు అందించకపోతే చర్యలు

రామగిరి: రోగులకు సరైన వైద్యం అందించకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే పరిటాలసునీత హెచ్చరించారు. గురువారం రామగిరి పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో వైద్యులతో సమావేశం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. అక్కడున్న అస్తవ్యస్త పరిస్థితుల గురించి వివరించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల నిధుల ఆస్పత్రి నిర్మించామని


రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అన్ని సౌకర్యాలు, సిబ్బందిని కేటాయించామన్నారు. కానీ ఇక్కడ రోగులకు సరైన వైద్యసేవలు అందించక చిన్నవాటికి కూడా అనంతపురం, ధర్మవరం ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ రోగులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఆస్పత్రిలో విద్యుత్ లోటల్టేజ్ సమస్య గురించి ఎమ్మెల్యేదృష్టికి తీసుకురాగా సరైన టెక్నీషియన్‌కు చూపిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. శుక్రవారం ప్రారంభమయ్యే స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేను ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి ఆహ్వానించారు.

20లోగా రోడ్డు పనులు ప్రారంభించాలి..

ఆత్మకూరు: అనంతపురం-తగరకుంట రోడ్డు పనులను 20వ తేలోగా ప్రారంభించాలని, లేదంటే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె బీ యాలేరు మార్గంలో తోపుదుర్తి, తగరకుంట వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అప్పటి తోపు ప్రకాష్‌రెడ్డి ఆయన సోదరులు కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం వారిని బెదిరించి పనులు ఆపేయించి పారిపోయారని విమర్శించారు.

మహిళా క్రికెట్ పోటీల్లో అనంత, చిత్తూరు జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, చిత్తూరు జట్లు గెలుపొందాయి. గురువారం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 37.2ఓవర్లలో 133పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 36.2ఓవర్లలో 92పరుగులకే కుప్పకూలింది. అనంతపురం బౌలర్ హర్షిత నాలుగు వికెట్లు తీశారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన చిత్తూరు, నెల్లూరు జట్ల పోరులో మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు 44 ఓవర్లలో 126పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 25.2ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 128పరుగులు చేసి 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

ప్రభుత్వ హామీల అమలుకు పోరాటం: సీపీఐ

అనంతపురం విద్య, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా నూతన కార్యదర్శి నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన కమిటీ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులు, మహిళలు, కార్మికులు,ఉద్యోగుల సమస్యలతో పాటు సూపర్‌సిక్స్ హామీల అమలుకు సీపీఐ దశలవారీ ఉద్యమాలు చేస్తుందన్నారు. నూతన సంయుక్త కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, నేతలు శ్రీరాములు, రమణ, సంతోష్, రాజేష్, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

నార్పల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న శింగనమల నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ప్రిన్సిపాల్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు పది మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 9010039901 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలు

గార్లదిన్నె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైల్వే గేట్ సమీపంలో గురువారం ఉదయం కాశమ్మ అనే మహిళలపై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు భర్త నల్లప్పతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఉదయం ఇంటి వద్ద పనిచేసుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా మీదకు వచ్చి దాడి చేసిందని తెలిపారు. మొహం, కాళ్లు, చేతులపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను 108 ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

- టీడీపీ నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు, రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందులలో వైసీపీ ఓటమిచెందడంతో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ హయాంలో జగన్ ఎన్నో అరాచకాలు చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గుండాయిజం పాలన నడిపించారన్నారు. కనీసం టీడీపీ వారిని నామినేషన్లు కూడా వేయనీయకుండా పాలించారన్నారు. గురువారం పులివెందులలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో ఒక రోజే ముందే స్వాతంత్ర్యం వచ్చిందన్నారు.

దౌర్జన్యాలను ప్రశ్నిస్తే రామకృష్ణను విమర్శిస్తారా?

● టీడీపీ శ్రేణులపై సీపీఐ నాయకుల ఫైర్


అనంతపురం విద్య, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న అనంతపురంలో అల్లర్లు, దౌర్జన్యాలు, కబ్జాలు చేస్తున్నారని నిత్యం బాధితులు ఆందోళన చెందుతున్నారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామక్రిష్ణ ఎమ్మెల్యేపై వ్యాఖ్యలు చేస్తే ఆ పార్టీ నాయకులు కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడడం ఏంటని సీపీఐ శ్రేణులు మండిపడ్డారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో నగరకార్యదర్శి శ్రీరాములు, సహాయకార్యదర్శి రమణ, ఏఐవైఎఫ్ సంతోష్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎందరో ఇక్కడ ఎందరో ఎమ్మెల్యేలు నగరాభివృద్ధికి పాటుపడ్డారని, రామక్రిష్ణ కూడా ఎమ్మెల్యేగా ఉండి పేదప్రజలకు ఇంటిస్థలాలు, పట్టాలు ఇప్పించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే దగుపాటి వెంకటేశ్వరప్రసాద్ పదవి చేపట్టిన ఏడాదికే రౌడీయిజం చేయిస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించడమే సీపీఐ హక్కు అని, పార్టీపై కొందరు టీడీపీ నాయకులు రామక్రిష్ణను, పార్టీని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

గార్లదిన్నె, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజనేయులు నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ గెస్ట్ టీచర్ పోస్టు కొన్ని రోజులుగా ఖాళీగా ఉందన్నారు. పీజీ, బీఈడీ పూర్తిచేసిన వారు మ్యాథ్స్ గెస్ట్ టీచర్ పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 8712625062 నంబరులో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

● ముస్తాబైన ఇస్కాన్ మందిరం



అనంతపురం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని వేడుకలకు జిల్లాలోని కృష్ణమందిరాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లాకేంద్రంలోని ఇస్కాన్ మందిరంలో శుక్రవారం నుంచి వేడుకలు ప్రారంభమవనున్నాయి. ఇస్కాన్ మందిరాన్ని విద్యుద్దీపాలంకరణలు, ప్రత్యేక డెకరేషన్‌లతో ముస్తాబుచేశారు. గోకులకృష్ణుడిని దర్శించుకునేందుకు వచ్చే వేలాదిమంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం ఇస్కాన్ మందిరం వద్ద బారికేడ్ల నిర్మాణం చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ఉన్న శ్రీకృష్ణ మందిరాల్లోనూ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించనున్నారు. వేడుకల నేపథ్యంలో తల్లిదండ్రులు సైతం తమ చిన్నారులకు రాధా, కృష్ణుల వేషాలు వేయించి ముచ్చటపడేందుకు సమాయత్తమయ్యారు.

వేడుకలకు సర్వం సిద్ధం

- దామోదర్ గౌరంగదాస్, ఇస్కాన్ మందిర చైర్మన్



శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లను సిద్ధం చేశాం. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు విశ్వశాంతి మహాయజ్ఞం, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు హరినామ సంకీర్తన, సాయంత్రం 4గంటలకు ఆలయం ముందు భక్తులచే ఉట్టి కొట్టు ఉత్సవం, 5 గంటలకు హనుమద్ వాహనసేవ, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు ఊంజల సేవ నిర్వహిస్తాం. శనివారం కృష్ణాష్టమి పర్వదినాన ఉదయం నుంచే రాధాపార్థసారథులకు ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు చేయడంతోపాటు ఉదయం 10 గంటలకు హరినామ యజ్ఞం, భక్తులకు దర్శన వసతి కల్పిస్తాం. ఆదివారం ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంత శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహాభిషేకం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమంతో వేడుకలు ముగుస్తాయి.


విద్యుద్దీపకాంతుల్లో ఇస్కాన్ మందిరం

రేపు సాయిగోకులం...

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సాయి ట్రస్టు, శ్రీనృత్యకళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో లలితకళాపరిషత్‌లో శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు సాయిగోకులం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

నక్ష రీసర్వేపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఉన్న ఆస్తులను డిజిటలైజేషన్‌లో భాగంగా అనంత నగరపాలక సంస్థ పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైందని, ఆస్తుల రీసర్వేపై ప్రత్యేకదృష్టి సారించి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక అనంత నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్‌డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్ (నక్షా) కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఆస్తులను లెక్కించి, డిజిటలైజేషన్ చేసి, ప్రతి ఆస్తి నుంచి ప్రభుత్వానికి ఆదాయాన్ని సక్రమంగా వచ్చేందుకే నక్ష రీసర్వే చేపట్టారన్నారు. డ్రోన్ కెమెరాతో జియో ట్యాగ్ చేసి, ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ) ఆధారంగా ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. నక్ష బృందాలు సకాలంలో సర్వే పూర్తి చేసి, 45రోజుల్లో ఓఆర్ఐ ఆధారంగా 50రోవర్లను ఏర్పాటు చేశారన్నారు. అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. టీపీఓ శిరీష, టీపీఎస్ మంజుల, సచివాలయ ఉద్యోగులు వీఆర్ఓలు, అడ్మిన్‌లు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కీలకం

● ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమగ్రాభివృద్ధి జరగాలంటే మాస్టర్ ప్లాన్ కీలకమని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అన్నారు. గురువారం జేసీ క్యాంపు కార్యాలయంలో అహుడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, మాస్టర్‌ప్లాన్, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్ఆర్ఎస్)కు సంబంధించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అహుడా పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి మున్సిపాలిటీల పరిధి మాస్టర్ ప్లాన్లను రూపకల్పన చేశారని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణతో పాటు అవగాహన కల్పించాలన్నారు. మాస్టర్ ప్లాన్‌తో పట్టణాలకు దీర్ఘకాలిక వ్యూహాన్ని నిర్దేశిస్తుందన్నారు. భూ వినియోగం, రవాణా, రహదారి విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పన అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను కలిగి ఉంటుందన్నారు. ప్రభుత్వం ఇటీవల అనధికార లేఅవుట్లు, ప్లాట్ల నియంత్రణ పథకం కింద 2025 జూన్ 30 కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు 90రోజుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. స్థల యజమానులకు ఉపశమనంగా ఓపెన్ స్పేస్ చార్జీలపై 50శాతం సడలింపు ఉంటుందన్నారు. 45 రోజుల్లో చెల్లిస్తే పెనాల్టీ చార్జీలపై 10శాతం రాయితీ, 90రోజుల్లో చెల్లిస్తే 5శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

సమాచార హక్కు చట్టంతోనే పారదర్శక పాలన


ర్యాలీ చేస్తున్న సహకార శాఖ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెరుగుతుందని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి అన్నారు. సమాచార హక్కు చట్టం ఏపీ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో స్థానిక కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, రాజురోడ్డు, ఆర్ఎఫ్ రోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ట్స్ కాలేజీ మీదుగా డీసీఓ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా సహకార శాఖ, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 614 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య విజయం: బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో టీడీపీ గెలుపు ప్రజాస్వామ్య విజయమని శింగనమల ఎ మ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసినట్లు తెలిపారు. సొంత ఇలాఖాల్లో ఓటమిని జీర్ణించుకోలేక జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టే విధంగా వాఖ్యలు చేయడం తగదన్నారు. టీడీపీ గెలుపుతో పులివెందుల ప్రజలకు ఒకరోజు ముందుగానే స్వాతంత్ర్యం లభించినట్లైందన్నారు.

'అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠకు సహకరించండి'


విరాళాలు సేకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గార్లదిన్నె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠకు ప్రతి ఒక్కరూ తమవంతుగా విరాళాలు అందించాలని గుణకరణ అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు కోరారు. గ్రామంలో నూతనంగా లక్షలాది రూపాయలతో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు కమిటీ సభ్యులు రెండు రోజుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. వారు మాట్లాడుతూ స్వామి మూలవిరాట్ ప్రతిష్ఠకు ప్రతి ఒక్కరి వంతు ఉండాలనే ఉద్దేశంతో విరాళాలు సేకరిస్తున్నామన్నారు. సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, బాలరాజు, రామాంజనేయులు, పెరుమాళ్ళు, గుత్తా లక్ష్మీనారాయణ, మిషన్ గోపాల్, డాబా వెంకటేష్, మోహన్, రంగనాయకులు, శివ, ప్రతాప్‌రెడ్డి, ఆది, విజయలక్ష్మి, భాగ్యమ్మ, ఆశోక్ పాల్గొన్నారు.

ఊపందుకున్న పంటల సాగు

బొమ్మనహాళ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ నీరుకు తోడు వర్షాలు రావడంతో మండలంలో వరి పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్, లింగదహాల్, ఉప్పరహాళ్, రంగాపురంక్యాంప్ తదితర గ్రామాల్లో వరి సాగు చేశారు. మొత్తం ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. అలాగే అన్ని పంటలకు ఈ వర్షాలు బాగా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. సజ్జ 200 ఎకరాలు, మొక్కజొన్న 2,200 ఎకరాలు, కందులు 2,470ఎకరాలు, ఆముదం 271 ఎకరాలు, పత్తి 745 ఎకరాలల్లో సాగు చేశారని తెలిపారు. వరి సాగు ఇంకా తొమ్మిది వేల ఎకరాలు సాగు అయ్యే అవకాశమున్నట్లు అంచన వేస్తున్నామన్నారు.


బొమ్మనహాళ్ వద్ద సాగైన వరి పంట

న్యూస్ బాక్స్

ఫలాలతో స్వామికి అలంకరణ



బొమ్మనహాళ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామిని ముసంబి ఫలాలతో అలంకరించారు. శ్రావణ మాసం బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఐదో రోజైన గురువారం స్వామివారికి ఇలా ప్రత్యేక అలంకరణలో పలు పూజలు నిర్వహించారు.

గోపుర కలశం ఊరేగింపు


కలశాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కూడేరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జోడు లింగా లసంమేశ్వరస్వామి ఆలయ గోపురంపై కలిశం దెబ్బతినడంతో నూతన కలిశాన్ని కురుబ సిద్దన్న కుటుంబ సభ్యులు తయా రు చేయించారు. గురువారం ఆ కలిశాన్ని ఊరేగించారు.

కలశ నిర్మాణానికి విరాళం



కుందుర్పి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రకుంటలో గుమ్మటం శివాలయ గోపురం పైన రూ.45 వేలతో కలశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో అదే గ్రామానికి చెందిన చాకలి అంజి రూ. రూ.22,500ను ఆలయ కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. మిగిలిన మొత్తన్ని విరాళంగా ఇవ్వడానికి భక్తులు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు.

వెండి పల్లెం వితరణ



తాడిపత్రి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవనగర్‌లోని శ్రీ శివసాయి మందిరానికి శ్రీనివాసపురానికి చెందిన పారిశ్రామికవేత్త దబ్బర వెంకటనారాయణ అలియాస్ దబ్బర బాబు రూ.52 వేలు విలువైన 405 గ్రాముల వెండి పల్లెంను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణ


కృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడి, గోపిక వేషధారణలో అలరించారు. ఇందులో పాఠశాల డైరెక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్‌లు ఓంకారప్ప, గురురాజ్, హెచ్‌ఎం నాగమణి పాల్గొన్నారు.

శివుడికి ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న భానుమతి

బెళుగుప్ప, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆదిశంకర సిద్దాంత ప్రచారకులు, రామనాథ్ వేదాంత మండలి వ్యవస్థాపకురాలు సద్గురు భానుమతి స్థానిక శివాలయంలోని మరకత శివలింగానికి గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున శిష్యులు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

తాడిపత్రి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు రూ.10 వేలు విలువైన నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఇందులో రోటరీక్లబ్ అధ్యక్షుడు కిషోర్, సభ్యులు మద్దిలేటి, జోసఫ్‌రెడ్డి, షాకీర్, బాలసుబ్రహ్మణ్యం, రమేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

55 అడుగుల జెండాతో ర్యాలీ


కుందుర్పిలో భారీ జెండాతో విద్యార్థుల ర్యాలీ

కుందుర్పి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్‌ఘర్ తిరంగాలో భాగంగా 55 అడుగుల జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపీచంద్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఆర్ సుబ్బరామప్ప, హనుమంతప్ప, హనుమంతరాయుడు, పెన్నోబుళేసు, వీరేష్, మహేష్, దామోదర్, నాగవేణి, గీతారాణి, రోచనాపాణి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో వజ్రకరూరు సర్పంచ్ సత్తా


సర్పంచ్ మోనాలిసా

ఉరవకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తన ప్రతిభతో వజ్రకరూరు సర్పంచి మోనాలిసా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. భారత నాణ్యత మండలి దేశంలోని సర్పంచులకు ఆన్‌లైన్‌లో నిర్వహించే సర్పంచ్ సంవాద్ పోటీలలో మోనాలిసా జాతీయస్థాయిలో జూలై మాసానికి మొదటి స్థానంలో నిలిచారు. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్ అనే అంశం మీద తన ఆలోచనలు పంచుకుని రూ.35 వేల బహుమతికి ఎంపికయ్యారు. గతంలో ఆమె కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిగా ఆదర్శ పాఠశాలలో పనిచేశారు. అలాగే జూన్‌లో ఢిల్లీలో నిర్వహించిన మహిళ ప్రాతినిథ్యం అనే కార్యక్రమంలో మొదటి స్థానం దక్కించుకున్నారు.

గాంధీజీకి నిలువుదోపిడీ ఇచ్చిన పెద్దవడుగూరు


బహిరంగ సభలో మాట్లాడుతున్న గాంధీజీ (ఫైల్)

పెద్దవడుగూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మండల కేంద్రానికి వచ్చిన మహాత్మాగాంధీకి నాటి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా హరిజనోద్ధరణ కోసం నిధులు ఇవ్వాలని గాంధీజీ పిలుపునిచ్చారు. దీంతో మండల కేంద్రానికి చెందిన చిన్ననారపరెడ్డి, చింతల చెరువు గ్రామానికి చెందిన హంపమ్మ, ప్రజలు తమ ఒంటిపైన ఉన్న విలువైన బంగారు నగలు, డబ్బులు అక్కడికక్కడే విరాళాలు అందించి తమ దేశభక్తిని చాటుకున్నారు.

రైతు సేవా కేంద్రానికి చేరిన యూరియా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యల్లనూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రానికి గురువారం 12 టన్నుల యూరియా చేరింది. యూరియా దొరక్క మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 12న వరి రైతుకు యూరియా కష్టాలు అనే వార్త ఆంధ్రజ్యోతి ప్రచురించింది. వ్యవసాయ అధికారులు స్పందించి.. జిల్లా అధికారులతో మాట్లాడి ఎరువుల దుకాణాలకు కాకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాలకే వచ్చేలా చేశారు. త్వరలో రైతులందరికి యూరియాను పంపిణీచేస్తామనిఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి మధు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి మందలింపు

- సచివాలయ భవనం శిథిలావస్థలో ఉందని చెప్పడమే నేరమా.?
- మరో అద్దె ఇంట్లోగానీ, హెల్త్ క్లినిక్‌లోగానీ నిర్వహించుకోవాలని అధికారుల ఉచిత సలహా


పంచాయతీ కార్యదర్శిని నిలుచోబెట్టి మాట్లాడుతున్న అధికారులు

విడపనకల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'మేడం.. సచివాలయ భవనం పాతదై.. కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాలు వస్తుండటంతో మొత్తం కారుతోంది. పాములు తిరుగుతున్నాయ్.. ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నాం. సచివాలయానికి నిర్మించిన కొత్త భవనం ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉంది. అందులో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోండి..' అని డొనేకల్లు గ్రామ కార్యదర్శి శ్రీదేవి ఎంపీడీఓ షకీలా బేగంను విజ్ఞప్తి చేయడమే నేరమైంది. గురువారం ఆమెను ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు నిలుచోబెట్టి మందలించారు. 'పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు నీకు నూతన సచివాలయ భవనాన్ని అప్పగిస్తే నీవు వెళ్లకుండా మా మీద పడి మమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నావ్.. చేతనైతే మరో అద్దె ఇల్లు మాట్లాడుకో.. లేదా హెల్త్ క్లినిక్‌లో ఉండండి. ఇవీకాదంటే కాంట్రాక్టర్‌తో నువ్వే మాట్లాడుకొని తాళాలు ఇప్పించుకో..' అంటూ ఎంపీడీఓ, ఆ అధికారులు చేతులు ఎత్తేశారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు.. సమస్యను మీరే పరిష్కరించకోండని మందలించడంతో సచివాలయ ఉద్యోగులు అర్థంకాని పరిస్థితిలో ఉండిపోయారు.

అవినీతిపై ప్రాథమిక విచారణ

యాడికి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామపంచాయతీలో జరిగిన అవినీతిపై ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటి ఎంపీడీఓ శశికళ గురువారం ప్రాథమిక విచారణ చేపట్టారు. యాడికి గ్రామపంచాయతీలో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రాథమిక విచారణ పూర్తయిందని, దీనిపై నివేదికను తయారుచేసి డీఎల్‌డీఓకు అందజేస్తామన్నారు. విచారణలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి అశ్వర్థమనాయుడు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర, సర్పంచు అనురాధ పాల్గొన్నారు.

మోకాలి లోతు గుంతలు


గుంతకల్లు రోడ్డు గుంతలో ఇరుక్కుపోయిన ఆటో

గుత్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతకల్లు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. వాటిలో నీరు నిల్వ ఉండటంతో అది గుంత అని గుర్తించలేక చాలా మంది ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. అనేక వాహనాలు ఆ గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అండర్ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టండి

తాడిపత్రి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఎక్కడచూసినా మురికినీరు తాండవం చేస్తోందని, వీటి వల్ల దోమలు అధికమై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ వాపోయారు. పట్టణంలోని 11వ వార్డులో నిలిచిన మురికినీటి వద్ద ఆయన గురువారం నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులకు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ ... అండర్‌డ్రైనేజీ వ్యవస్థను సరిగా నిర్వహించడంలో చూపడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, శీనా, అబ్రహం, రంగస్వామి పాల్గొన్నారు.

వీరాపురం సహకార సంఘం ఏర్పాటు


బాధ్యతలు స్వీకరిస్తున్న తమ్మినేని ప్రభాకర్‌నాయుడు

తాడిపత్రి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని స్థానిక సొసైటీ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంబులపాడుకు చెందిన తమ్మినేని ప్రభాకర్‌నాయుడు, వీరాపురం సింగిల్ విండో డైరెక్టర్లుగా బొందలదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని, చిన్న పోలమడ గ్రామానికి చెందిన గుర్రం నాగన్నను ఎన్నుకున్నట్లు సెక్రటరీ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం వారు బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డికి, డైరెక్టర్లకు, సొసైటీ సభ్యులకు తమ్మినేని ప్రభాకర్‌నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ


ప్రమాణ స్వీకారం చేస్తున్న నాగార్జున, చిత్రంలో విప్ కాలవ

కణేకల్లు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగిల్ విండో (రూరల్ బ్యాంక్) అధ్యక్షుడిగా హనకనహాళ్‌కు చెందిన వాల్మీకి నాగార్జున, సభ్యులుగా మారెంపల్లి ఈరప్ప, ఆదిగానిపల్లి తిప్పేస్వామిలను ప్రభుత్వం గురువారం ఎంపిక చేసింది. 1981 ఈ బ్యాంకు ఆవిర్భావం నుంచి కాంగ్రెస్, వైసీపీ అభ్యర్థులే అధ్యక్షులుగా ఉంటూ వచ్చారు. 44 ఏళ్ల తర్వాత అధ్యక్ష స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. గురువారం స్థానిక ఆ బ్యాంక్‌లో జరిగిన ప్రమాణస్వీకారానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు కమిటీ ఛైర్మన్ హనుమంతరెడ్డి, మాజీ ఛైర్మన్ ఎస్‌కే మల్లికార్జున, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, సుదర్శన్, వన్నారెడ్డి, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, మారుతి, రుద్రముని, వాల్మీకి విజయ్, మాబుసాబ్, చాంద్‌బాషా, శరభనగౌడ్, జయరాంచౌదరి, సూరి, మరేష్, కురుబ నితీష్, వన్నూరుస్వామి, వేలూరు మరియప్ప, కురబ నాగరాజు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉరవకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విడపనకల్లు రైతు సేవా సహకార కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. విడపనకల్లు రైతు సేవా సహకార సంఘం పర్సనల్ ఇన్‌చార్జి కుమార్ మాట్లాడుతూ.. సమచార చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు అయిందన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు గురించి ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈనెల 18 వరకూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విడపనకలు ఎఫ్‌ఎస్‌సీఎస్ సీఈఓ నారాయణస్వామి, కొట్టాలపల్లి సీఈఓ ఆదినారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన ఇంటి పైకప్పు


వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

పెద్దపప్పూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళ సుబ్బమ్మకు చెందిన ఇంటి పైకప్పు కూలింది. బుధవారం రాత్రి ఆమె నిద్రిస్తుండగా.. ఓ పక్క ఇంటి కప్పు కూలింది.

క్రైం న్యూస్..

గర్భిణి ఆత్మహత్య

కళ్యాణదుర్గం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శ్రీనివాసులు భార్య శ్రావణి (24) గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఐదేళ్ల క్రితం వీరికి వివాహమైంది. కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. శ్రావణి నాలుగు నెలల గర్భవతి. గురువారం శ్రీనివాసులు కూలిపనికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రావణి ఇంట్లో ఉరివేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి బంధువులకు సమాచారం అందించారు. వారు వచ్చి.. రక్షించేలోపే ఆమె మృతిచెందింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ యువరాజు తెలిపారు.

నవ వరుడు..

పెద్దవడుగూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రాజేష్ (23) గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పెద్దవాగు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. కాగా, రాజేష్‌కు 15 రోజుల కిందటే వివాహమైంది. అతని తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం రోడ్డు దాటుతున్న కుందుర్పి మండలం తెనగల్లుకు చెందిన ఆనంద్ (38)ను వేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. వెంటనే ఆయన స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు అతన్ని 108 వాహనంలో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలుకు తీసుకొని వెళ్తుండగా.. మార్గమధ్యలో మరణించాడు. ఆనంద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆనంద్ ఓ ప్రైవేటు బస్సులో క్లీనర్‌గా పనిచేసేవాడు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో ప్రయాణికురాలు..

గుత్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గుత్తి జీఆర్పీ పరిధిలో కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వెంకటలక్ష్మి (48) గురువారం తెల్లవారుజామున మరణించింది. హైదరాబాదుకు చెందిన ఆమె తన భర్త రామలింగేశ్వర రావుతో కలిసి 12785 మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో బీ3 ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తున్నారు. తన భర్త ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైద్య పరీక్షల నిమిత్తం మైసూర్‌కు వెళ్తున్నారు. రైలు డోన్ సమీపంలో రాగానే వెంకటలక్ష్మి కుప్ప కూలిపోయింది. భర్త టీటీఈకి సమాచారం అందించాడు. ఆయన గుత్తి రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందజేశారు. రైలు గుత్తికి చేరేలోపు వైద్య సిబ్బం ది స్టేషన్‌కు చేరుకున్నారు. బోగిలో ఉన్న ప్రయాణికురాలిని పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుత్తిలో పగలే చోరీ

గుత్తి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత సీపీఐ కాలనీలో నివాసముంటున్న అనసూయమ్మ మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ముఖానికి మాస్క్ ధరించిన ఓ గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమె మెడలో ఉన్న ఐదుతులాల బంగారు తాళిబొట్టును లాక్కొని పరారయ్యాడు. ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చోరీపై ఆరాతీస్తున్నారు.

కదరంపల్లిలో..

రాయదుర్గంరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లి గ్రామానికి చెందిన ఎర్రిస్వామి ఇంట్లో అర తులం బంగారు, రూ. 15 వేల నగదు చోరీ అయింది. ఎర్రిస్వామి గురువారం తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి దైవదర్శనానికి వెళ్లాడు. పూజ ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉండటంతో లోనికి వెళ్లి పరిశీలించాడు. బీరువాలో ఉన్న అర తులం బంగారు. రూ. 15 వేలు చోరీ అయినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎలుగుబంటి దాడి

కుందుర్పి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాల పెన్నోబులేషప్ప సీతాఫలాల కోసం చిన్నకొండ ప్రాంతంలోని ఎర్రగొండ వద్దకు గురువారం వెళ్లాడు. అక్కడ ఓ ఎలుగుబంటి అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. బంధువులు అతన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొమ్మనహాళ్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవదాయశాఖ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. దాదాపు ఆరేళ్లుగా ఇక్కడ ధర్మకర్తల మండలి లేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో హనుమా.. పాలకులేరి శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి... పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయం ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.